# ప్రేమ నేర్పిన పాఠం

-యం.వెంకటేశ్వరరావు

నేను పనిచేస్తున్న కంపెనీకి కొత్త సేల్స్ మేనేజర్ వస్తున్నట్లు ఆఫీసులో అడుగుపెట్టగానే చెవినపడింది. అదే డివిజన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నాకు తెలియని టెన్షన్ మొదలైంది.

'రాబోయే మేనేజర్ ఎలాంటివాడో? ఎలా వుంటాడో?' ఆలోచిస్తూనే సీట్లో కూర్చున్నాను.

"ఆయుష్మతీ! నిన్ను సేల్స్ మేనేజర్ పిలుస్తున్నాడు?'' అని చెప్పింది నా పక్కసీటు ప్రసీద.

"ఏమిటే? కొత్త మేనేజర్ అప్పుడే వచ్చాడా?''

"అవును. ఆయన ఉదయం ఎనిమిదిగంటలకే కంపెనీకి వచ్చాట్ట. అందరూ వచ్చి తనని చూడాలి, మాట్లాడాలి వంటి ఫార్మాలిటీస్ తనకు నచ్చవనీ, పనుండి తననెవరైనా కల్సినప్పుడు తనే పరిచయం చేసుకుంటానని చెప్పాట్ట''

"ఊ...వెళ్లి చూసొస్తా'' అని ఛాంబర్‌వైపు వెళ్లాను.

"గుడ్‌మార్నింగ్ సార్'' మేనేజర్‌ని ఛాంబర్‌లో విష్ చేసిన నేను అతన్ని చూసి ఆశ్చర్యపోయాను.

"చక్రవర్తి! ఛ... వీడా కొత్త మేనేజర్? ఇంత పెద్ద పోస్టు వీడికి... ప్చ్...'' పెదవి విరిచాను.

***

ఆరేళ్ళు రివైండ్ చేస్తే...

ఆయుష్మతి ఉస్మానియాలో పిజి చేస్తున్న రోజులవి. చక్రవర్తి ఆయుష్మతి క్లాస్‌మేట్. రోజూ ఒకర్నొకరు చూసుకుంటూనే ఉంటారు. రోజూ ఏదో ఒక సందర్భంలో మాట్లాడుతూనే వుంటారు. జస్ట్ కాజువల్ టాక్స్...అంతే. ఫైనల్ ఎగ్జామ్స్ ఆఖరి రోజు. ఆయుష్మతి బస్టాప్‌లో గీత, శ్రావణిలతో నుంచుంది. అప్పుడు చక్రవర్తి అక్కడికొచ్చాడు.

"ఆయుష్మతీ! మీతో పర్సనల్‌గా మాట్లాడాలి. ఒక్క నిముషం ఇలా వస్తారా? ప్లీజ్...'' అన్నాడు.

"?'' అన్నట్లు భృకుటి ముడిచిందామె.

"ప్లీజ్'' అన్నట్లు అతడి చూపులు.

అతని పక్కకొచ్చి నిలబడ్డ ఆయుష్మతికి ఓ లెటర్ ఇచ్చి "ఆయుష్మతీ! ఐ లవ్ యూ. మీరు లేకపోతే నాకు జీవితమే లేదు. దయచేసి కాదని మాత్రం చెప్పకండి. నా వివరాలన్నీ ఈ లెటర్‌లో రాసాను'' అని గబగబా అప్పజెప్పినట్టు అనేసాడు.

ఆశ్చర్యంగా అతనివైపు చూసింది.

"మీమీద నాకలాంటి ఉద్దేశంలేదు. ఇలాంటివి నాకు నచ్చవు'' అని లెటర్ మడత విప్పకుండా అతనికి తిరిగిచ్చేసి వేగంగా తన ఫ్రెండ్స్ దగ్గరకొచ్చింది.

***

పదిరోజుల తరువాత పట్టువదలని ప్రేమికుడిలా చక్రవర్తి ఆయుష్మతి ఇంటికొచ్చాడు.

హాల్లో కూర్చుని పేపరు చూస్తున్న ఆయుష్మతి నాన్నగారిని పరిచయం చేసుకుని తన వివరాలు చెప్పాడు.

"సార్! నేను మీ అమ్మాయిని మనసారా ప్రేమిస్తున్నాను. పెళ్లి చేసుకుంటాను'' అంటూ తలా తోకా లేకుండా అడిగేసాడు.

"స్టుపిడ్! నీ కులమేమిటో, గోత్రమేమిటో తెలియకుండా నా కూతుర్ని ఇచ్చి పెళ్లి చేయమనడానికి నీకెంత ధైర్యంరా. గెటౌట్'' అంటూ తీవ్రస్థాయిలో అరిచాడు.

"సార్! ముందు నేను చెప్పేది వినండి. దయచేసి మర్యాదగా మాట్లాడండి. నేనూ గౌరవమైన కుటుంబం నుంచి వచ్చినవాడినే''

"ఓహో... అయితే వెళ్లి మీ పేరెంట్స్‌ని తీసుకురా''

"నాకు నాన్నలేరు''

"అందుకేనా? ఇలా ఉద్యోగం, సజ్జోగం లేని జులాయిలా ప్రేమాగీమా అని అంటున్నావు'' అన్నాడు ఆమె తండ్రి కోపంగా.

"సార్! నేను పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని. ప్రస్తుతానికి నిరుద్యోగిని కావచ్చు. తప్పకుండా నాకు ఉద్యోగం వస్తుంది. మీ అమ్మాయిని నాకు ఉద్యోగం వచ్చిన తరువాతనే చేసుకుంటాను. మీరు మీ అమ్మాయిని ఎంత ప్రేమగా చూసుకుంటున్నారో అంతకు పది రెట్లు ప్రేమగా చూసుకుంటాను. నామీద నాకా నమ్మకం వుంది'' అన్నాడతను.

"ధైర్యం ఒక్కటే పొట్ట నింపదు''

"రిక్షా లాగైనా సరే ఆయుష్మతిని ఆనందంగా చూసుకోగలను''

"నువ్వా పనిచెయ్యనూ వద్దు. రిక్షా తొక్కి నా కూతుర్ని ఆనందసాగరంలో తేలియాడించనూ వద్దు. ముందు బయటకి నడువు. ఐసే గెటౌట్'' అంటూ చక్రవర్తిని బయటకు గెంటేసాడు.

అక్కడేవున్న ఆయుష్మతి వైపు చూసిన చక్రవర్తితో "పనీ పాటా లేని నీలాంటివాడ్ని ఏ ఆడపిల్లా ఇష్టపడదు. నాన్న కోపం మరో రూపం దాల్చకముందే మర్యాదగా వెళ్లిపో ప్లీజ్'' అంటూ రెండు చేతులూ జోడించింది ఆయుష్మతి.

ఆ తరువాత ఏనాడూ చక్రవర్తి ఆయుష్మతి కంటపడలేదు.

***

ఆ చక్రవర్తే ఇవ్వాళ ఇంత పెద్ద కంపెనీకి సేల్స్ మేనేజర్‌గా, ఇంత గంభీరంగా ఉన్నాడేంటి?

ఆయుష్మతి నుంచుని తననే చూస్తుంటే చక్రవర్తి ఆమెని గుర్తించాడు.

"అరె...మీరా? ఆశ్చర్యంగా ఉందే. రండి...కూర్చోండి'' అన్నాడు.

చక్రవర్తి చూపులో గాంభీర్యానికి, మాటలో మర్యాదకి ఆయుష్మతి అవాక్కై ఇంకా ఆశ్చర్యంగా అతన్నే చూస్తూ నుంచుంది. అది గమనించాడు చక్రవర్తి.

"చూడండి. గతం జ్ఞాపకం చేసుకోకండి. అవి నాకు చెడురోజులు. ఎప్పుడు ఆ సంఘటన గుర్తుకువచ్చినా చాలా సిగ్గుగా ఉంటుంది...సారీ'' అన్నాడు. ఆ తరువాత కంపెనీకి సంబంధించిన విషయాలు మాట్లాడి పంపేసాడు.

ఆఫీస్‌లో పనిచేయడమే కాకుండా సబార్డినేట్స్‌తో పనిచేయించడంలోనూ, స్టాఫ్‌తో మర్యాదపూర్వకంగా మాట్లాడడంలోనూ, పై అధికారుల ప్రశంసలు అందుకోవడంలోనూ చాలా ఘటికుడని ఆ నోటా ఈనోటా వింటూ ఇప్పుడు కళ్లారా చూస్తున్న నాకు ఇప్పుడు చక్రవర్తి ఎంతో ఎత్తులో వున్నట్లు కనిపిస్తున్నాడు. గంటలు...రోజులు..

వారాలు ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాను.

***

ఆ రోజు లంచ్‌టైమ్‌లో చక్రవర్తి ఛాంబర్‌కి వెళ్లింది. "మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి" అంది భయం భయంగా.

"నో ప్రాబ్లమ్ రండి కూర్చోండి"

"నిజానికి ఇప్పుడు నేను చెప్పబోయే విషయం మీరు ఆరేళ్లక్రితం చెప్పిందే. అప్పుడు మీరు చెప్పిన ఆ మాటే ఇప్పుడు నేను సిగ్గు విడిచి చెబుతున్నాను. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అంది తలొంచుకుని అతని మొహంలోకి చూడకుండా.

"..."

"మాకెవరికీ పెళ్లిళ్ళు చేయకుండానే మా నాన్నకి పెరాలసిస్ వచ్చింది. మెడికల్లీ అన్‌ఫిట్ అయిన నాన్న చేసిన ఉద్యోగమే నాకిచ్చారు. గత నాలుగేళ్లుగా తమ్ముడి ఇంజనీరింగ్ చదువు, అక్కయ్య పెళ్లిచేసి వాళ్లని సెటిల్ చేసాను" అన్నాను తలెత్తకుండానే.

"ఐయామ్ సారీ ఆయుష్మతిగారూ! జీవితంలో మొదటిసారి మిమ్మల్ని ఇష్టపడ్డ మాట వాస్తవమే. ఇష్టపడ్డ మిమ్మల్ని కష్టపెట్టకూడదని, ఆఖరికి నా చదువు, స్టేటస్ మరచిపోయి రిక్షా లాగైనా సరే మిమ్మల్ని ఆనందంగా చూసుకుంటానని బిడియపడకుండా చెప్పాను. కానీ మీరూ మీ నాన్న ఇచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌తో, ప్రేమ పిచ్చితో మూసుకుపోయిన నా కళ్ళు తెరుచుకుని భవిష్యత్తువైపు దృష్టి మరల్చేలా



చేసాయి. కష్టపడి ఈరోజు నేనీ స్థితికి చేరుకున్నాను. ఆనాడు నా ఆర్థిక పరిస్థితిని, నిరుద్యోగాన్ని చూసి నా ప్రేమని గేలి చేసి గెంటేసారు. ఆ రోజు మీరు చేసింది కరెక్టే. కానీ ఆవేళ మీ మనసులోలేని నా స్థానం ఈరోజు నా స్టేటస్ తిరిగి తెస్తుందంటే నేను నమ్మను. ఐయాం సారీ... యూ కెన్‌గో'' అన్నాడు సీరియస్‌గా. సిగ్గు విడిచి అడిగినందుకు, అవకాశం తనదని తగిన గుణపాఠం చెప్పాడు అని మనసులో అనుకుంటూ మౌనంగా బయటకొచ్చిందామె. అవమానం, ఉక్రోషం...నెమ్మదిగా సీట్లో కూర్చోనీయలేదు, పని చేయనివ్వలేదు.

ఓ గంట తరువాత చక్రవర్తి పిలిచి అర్జంటుగా పంపాల్సిన ఫైలిచ్చి త్వరగా పూర్తి చేయమన్నాడు. మనసుని కంట్రోల్ చేసుకుని ఫైల్లో తల దూర్చాను.

***

వర్క్ కంప్లీట్ చేసి లేట్‌గా లంచ్ చేస్తోంది ఆయుష్మతి.

"మేనేజర్ సాయంత్రం రాడట'' అంది ప్రసీద.

"హూ...రాకపోతేనేం అందరిచేతా గాడిద చాకిరీ చేయిస్తున్నాడుగా''

"నువ్వు గాడిద చాకిరీ అను, గుర్రం చాకిరీ అను. చక్రవర్తిగారొచ్చాక ఆఫీస్‌లో పెండింగ్ ప్రసక్తేలేదు. రియల్లీ వర్క్ డెవిల్...'' అని ప్రసీద ప్రశంసలు కురిపిస్తోంది.

"ఆహా... ఆయనగారి వారసురాలు బయల్దేరిందండీ'' అన్నాను ఉక్రోషంగా.

***

సాయంత్రం ఆరుగంటలకు సిటీబస్ దిగి ఇల్లు చేరేసరికి ఇంటి గుమ్మంలో కారు కన్పించింది. 'ఈ కారు ఎక్కడో చూసినట్టుందే?' అనుకుంటూ లోపలికి వెళ్లబోతుంటే తల్లి గుమ్మంలోనే ఎదురొచ్చింది.

"త్వరగా రావే. నీకోసమే చూస్తున్నాం. నిన్ను చూడడానికి పెళ్లివారు వచ్చారు.వెళ్లి తొందరగా తయారుకా'' అంది తల్లి.

కాఫీ ట్రేతో హాల్లోకొచ్చిన ఆయుష్మతి అక్కడ చక్రవర్తిని చూసి షాకయ్యింది.

***

నెలరోజుల తరువాత మిస్ ఆయుష్మతి మిసెస్ చక్రవర్తిగా మారింది.

హనీమూన్ ముగించుకుని వచ్చాక ఆ రోజు చక్రవర్తి ఆఫీసుకు బయల్దేరుతూ "ఆయుష్మతీ త్వరగా తయారైతే ఇద్దరం కలసి వెళ్దాం'' అన్నాడు.

"ఎక్కడికి?'' అందామె బద్ధకంగా.

"ఆఫీసుకి''

"మీకు జోనల్ మేనేజర్‌గా ప్రమోషనొచ్చింది. ఇంకా నేను ఉద్యోగం చేయడం అవసరమా? నేనూ ఉద్యోగం చేస్తే బాధ్యతలు పెరిగి అలసిపోయి ఇంటికొచ్చే మిమ్మల్ని ఎవరు చూసుకుంటారు చెప్పండి. ఎంచక్కా మిమ్మల్ని గమనిస్తూ మీకు కావాల్సినవి చేస్తూ ఇంట్లోనే వుంటాను'' అంది.

"చూడు...పిజివరకు చదివిన చదువుని, నాలుగేళ్ల నుండి చేస్తున్న ఉద్యోగాన్ని నాకోసం వదిలేసి ఇంట్లో కూర్చుంటావా? ఊహూ... నేను అంగీకరించను. జోనల్ మేనేజరయ్యాక మనకిప్పుడు పెరిగిన బాధ్యతలతోపాటు అదనపు ఆడంబరాలు, ఖర్చులు పెరుగుతాయి. మంచి పోష్ ఏరియాలో ఇల్లు ఏర్పరచుకోవాలి. మనకి పుట్టబోయే పిల్లలకి మంచి కాన్వెంట్ చదువులు చెప్పించాలి. వాళ్ల భవిష్యత్తు కోసం పొదుపు చేయాలి. మంచి చదువులు చెప్పించాలంటే మనమిద్దరమూ కష్టపడాలి. చిన్న గీత పక్కన పెద్ద గీత గీసే ప్రయత్నం చేయాలిగానీ ఉన్న గీతనే చెరిపేస్తే మన ఉనికి ఎవరికీ తెలియకుండా పోతుంది''

"మీరేనా ఇలా మాట్లాడుతోంది. ఆ వేళ మా నాన్నతో రిక్షాలాగైనా నన్ను పోషిస్తానని గొప్పలు చెప్పారు. ఈవేళ ఆడంబరాలు, అంతస్తులు, పిల్లల చదువులంటూ నన్నూ ఉద్యోగం చేయమంటున్నారు. ఆనాటి మాటలన్నీ...''

"కరెక్టే. ఆ రోజే నువ్వు నన్ను పెళ్లి చేసుకోవడానికి అంగీకరించి వుంటే ఈరోజు నేనీ స్థితికి చేరుకునేవాడిని కాదేమో. ఏ ఉద్యోగమూ దొరక్క చివరికి రిక్షాలాగే పరిస్థితే వచ్చేదేమో! దానివలన ఎంతో విలువైన జీవితాన్ని కోల్పోయేవాడిని. ఆ రోజు మీ నాన్న, నువ్వు అలా మాట్లాడడంతో నాకు పట్టిన ప్రేమ పిచ్చి వదిలి జీవితపు విలువల్ని తెలుసుకున్నాను. డబ్బుంటేనే ఏ విలువలైనా నిలబడగలిగేది, ఏ ప్రేమైనా మనగలిగేది. అందుకని శరీరం సహకరించినంత కాలం కష్టపడి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాను. డబ్బు విలువ, ఉద్యోగం ఆవశ్యకతా ఆనాడే తెల్సిన నువ్వేనా ఇలా మాట్లాడుతోంది. నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. సర్లే... కమాన్ త్వరగా తయారవ్వు ఆఫీసుకు టైమవుతోంది'' అన్నాడు చక్రవర్తి.

అతని విశ్లేషణకి ఆశ్చర్యపోతూ కారెక్కింది ఆయుష్మతి.

★



## ప్రవర్తన

వారసత్వం కొంతమందికి బాగా కలిసి వస్తుంది. అయితే కొంతమంది తారలు తమతో పాటూ నటించిన తోటితారల ప్రవర్తన గురించి, వారి టాలెంట్ గురించి కితాబులు ఇస్తూ ఉంటారు. 'అంతర్‌మహల్' బెంగాలీ చిత్రంలో నటించిన సోహా అలీఖాన్ తనకి అభిషేక్ బచ్చన్ మంచి ఫ్రెండ్ అంటోంది. 'ఛార్మింగ్, టాలెంట్, స్టయిల్ ఉన్న నటుడు అభి. ఆయనతో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్. కొత్త నటినైనా కొన్ని విషయాల్లో ఆయన సలహా నాకు బాగా ఉపయోగపడింది' అంటోంది సోహా అలీఖాన్. ఈ కితాబులు విని బాలీవుడ్ జనం నవ్వుకుంటున్నారు.

